# అమ్మ వెళ్ళాక - డా.కె.గీత

ఆరు నెల్ల తర్వాత మళ్ళీ
గడియారం చప్పుడు ఇంటి గోడల్ని తీవ్రంగా తాకుతూ -
నిన్నటి దాకా ఏవేవో కబుర్లుండేవి
మాటల్లో ఏమి దొర్లినా
మనసుల మధ్య
అమ్మకు, నాకు మధ్య ఏదో ఆనందం పెనవేసుకునుండేది
తెల్లారి తన గదిలోకి వచ్చానా -
విడిచిన చలి కోటు, మఫ్లరు, గ్లోవ్స్ ఆప్యాయంగా తడిమాయి నన్ను
ఆమూల తన మంచమ్మీద నడుం వాల్చానా -
మెత్తని ప్రేమైక చేతులు నా చెంపలు నిమిరాయి
ఎయిర్ పోర్ట్ చెకింగ్ పాయింట్ లో
నా భుజమ్మీద కరడు కట్టిన అమ్మ కన్నీళ్ళన్నీ
నా కన్నీళ్ళై ఈ గది లోనే ప్రవహిస్తున్నాయి
ఓ ప్లాస్టిక్ పూల తీగో
సువాసన కొవ్వొత్తి దీపమో చూస్తే సంతోషపడిపోయి
తనకే కావాలని తపించేది..
ఎంత చిన్న కోర్కెలు..!
అమ్మ వున్న ఈ ఆరు నెల్లు
పిల్లలకూ నాకు మధ్య ఒక కొత్త అనుబంధం
మమ్మల్ని ఇంకాస్త దగ్గరకి నేస్తూ -
పసిపాప మాకు కొత్త ప్రాణమైంది
మేం ముగ్గురం ఒకే కేంద్రం నించి ఉద్భవించి
ఒక పుష్పానికి మూడు రేకులై ఒకర్నొకరు చూసుకుని మురిసిపోయే వాళ్ళం
చలేస్తే ఒకరి రెక్కల చాటున మరికళ్ళం దాక్కుని గువ్వ పిట్టలై కువకువలాడుకునే వాళ్ళం
కిటికీలో వెలవెల బోతున్న బొట్టు బాక్సు, మందుల పెట్టె

గదంతా బావురుమంటున్న సామాన్ల వెల్తి
ఏదో ఇల్లు ఖాళీ చేసినట్లు -
కాస్సేపు ఇంకెక్కడో ఉందిలే ..
నిశ్శబ్దంగా రాసుకుంటూనో
పుస్తకాలు చదూకుంటూనో
కాఫీని నెమ్మదిగా తాగుతూనో
అలా అపార్ట్‌మెంట్ చుట్టు అడుగులేస్తూనో -
గదిని ఖాళీ చేసినా మనసుని ఖాళీ చేయలేని నిస్పత్తువ
క్షమించు అమ్మా!
ఆరునెల్ల కంటే ఎక్కువ పరాయి దేశం పర్మిటించదు..!
ఒకసారి నీనించి విడిపడినా పుత్రికా రత్నం నీతో వెనక్కి ప్రయాణించదు..
అయినా చివరి నిమిషంలో వెనకే పరుగెత్తిరావాలనిపించింది
మళ్ళీ ఒకసారి నీ కడుపులోకి ప్రవహించి హాయిగా నిద్రించాలనిపించింది
ఆరునెల్లు సరిగా చేసినా?
సంతోషంగా గడవనిచ్చేనా?
ఆరురోజులై గడిచిన ఆరునెల్లలో
కనీస సంతృప్తిని మిగిల్చేనా?
ఏవేవో నిశ్శబ్దాలు
గడియారం చప్పుడు మాత్రమే గోడల్ని తీవ్రంగా తాకే
గదిలో -
ఏవేవో ఆలోచన్లు
గడియారం చప్పుడుతో పాటూ
గోడల్ని తీవ్రంగా తాకుతూ!



# ఎంతుంది కాలం మిగిలి? జ్యోతిర్మయి మళ్ల

**అద్భుతం..అనంతం..అతిరమ్యం..ఈప్రకృతి**
మంచుకొండలూ సెలయేరులూ
వనసీమలూ చెట్టుచేమలూ
ఇసుకతిన్నెలూ సముద్రాలూ
ఆకాశం హరివిల్లూ
నెలవంకా తొలిసంధ్యా..
ఎన్నెన్నో అందాలు

అన్నీ చూడాలి.. వీలయినన్ని చిత్రించాలి!
ఐతే ఎంతుందో ఇంకా మరి నా కాలం మిగిలి?

అఖండం..అగణితం..అద్వితీయం..మన సాహిత్యం
వేదాలూ శాస్త్రాలూ
పురాణాలూ ఇతి హా సాలూ
గ్రంధాలూ ప్రబంధాలూ
కవితలూ కావ్యాలూ
నాటకాలూ నానోలూ..
ఎన్నెన్నో జ్ఞానాలు

అన్నీ చదవాలి..ఎన్నో నేర్చుకోవాలి!
ఐతే ఎంతుందో ఇంకా మరి నాకాలం మిగిలి?

అమోఘం..అపూర్వం..అతిమధురం..సంగీతం
శాస్త్రీయమూ లలితమూ
ఆంధ్రమూ అంధ్రేతరమూ
భరతమూ పాశ్చాత్యమూ
జానపదాలూ జావళీలూ
భజన్‌లూ ఘజల్లూ
ఎన్నెన్నో శ్రావ్యాలు

అన్నీ ఆస్వాదించాలి..కొన్నై నా అభ్యసించాలి!
ఐతే ఎంతుందో ఇంకా మరి నాకాలం మిగిలి?

అపారం..అజరామరం..అతిసుకుమారం..ప్రేమ
కన్నవారు.. నాతోఉన్నవారు
బంధువులు స్నేహితులు
ఆత్మీయులు శ్రేయోభిలాషులు
తెలిసినవారు తెలియనివారు
ద్వేషించువారు దూషించువారు..
ఎన్నెన్నో బంధాలు

అందర్నీ ప్రేమించాలి..అందరిచే ప్రేమించబడాలి!
ఐతే ఎంతుందో ఇంకా మరి నాకాలం మిగిలి?



# అదిగదిగో

**ప్రవీణ కొల్లి**

అదిగదిగో ఆనందం,
చిటారు కొమ్మన మిఠాయి పొట్లం,
అదిగదిగో సంతోషం,
ఎగిరే పక్షుల రెక్కల మాటున మరి భద్రం,
అదిగదిగో మనశ్శాంతి గమ్యం,
అలల లయల హోయలలో తేలియాడే చందం.
అదిగదిగో మందహాసం,
సెలయేటి పరవళ్ళ కేళీవిలాసం,
అదిగదిగో విలాసం,
ఆకాశాన ఇంద్రధనుస్సు పరావర్తనం,
అదిగదిగో గమ్యం,
గగనాన మబ్బుతునకల పయనం,
అదిగదిగో విజయం,
పిల్లగాలి పలకరింపుల నిత్యచలనం,
అదిగదిగో జీవితం,
ధరణి సహనపు ఓదార్పుల నిట్టూర్పుల సంగమం,
రణరంగపు శౌర్య పరాక్రమాల వీరత్వం!!



# నేను

**సన్యాసి**

ఈ చిదంబరాకాశ వేదికపై
సంకుచిత వామ పాదమ్మునెత్తి
తాండవము చేయు నటరాజ మూర్తి నేను
నాదు దక్షిణ  పాదమ్ము క్రింద నలిగి,
నశించు అపస్మార దనుజుండు గూడ నేనె.

ఒక్కత్రుటిలోనె వీరవిహారమొనర్చి
మానవాళిని కబళించిన సునామీని నేను
నాదు పరిష్వంగమ్ములో హాయిగా కనుమూసి
ఓలలాడిన మానవాళి  గూడ, నేనే

విశ్వసంపదనంత కబళించు వేయు
వైశ్వానరుడ మాత్రమే గాదు, నేను
విశ్వమానవ కళ్యా ణమునకు
తోడుపడియెడు విశ్వనరుడ.

నాది, నాది యని మతిచలించి, పరిభ్రమించు
జీవకోటికిపుడు "నేతి,నేతి" యన్న
గుణ పాఠమీయ, నా పర్యవేక్షణలో
ప్రకృతి మాత పరుగెత్తి వచ్చె నేడు.

*ఈ మధ్యనే వచ్చిన సునామీని తలచి,  స్పందించి వ్రాసినది*

# రింగు రింగు భామ

విజయ చావలి

ముచ్చటైన రంగుల్లో
పాకెట్లో జాకెట్లో
రక రకాల శబ్ద స్వర సుభాషిత
చేతికీ చెవికీ సంతతత భూషిత
రింగు రింగు మంటూ రొద చేస్తుంది
ఎచ్చట నుండో వచ్చిన ముచ్చట వినిపిస్తుంది!
వయ్యారి భామల చేతుల్లో
వేలాడే అందమైన బేగుల్లో
హుషారు కుర్రాళ్ళ చెవుల్లో
జీన్స్ పాంట్ పాకెట్లో బెల్టుల్లో
పురోహితుల మెడల్లో
పాలవాడి జేబుల్లో
ముసలివాడి సంచీల్లో
రింగు రింగు భామ తొంగి చూస్తుంది
రింగురింగు మంటూ రాగం వినిపిస్తుంది!
ఆప్యాయంగా పలకరించినా
అధికారంగా ఆజ్ఞాపించినా
నిదానంగా నిర్దేశించినా
నిరీక్షణతో నివేదించినా
ప్రేమ పలకరింపు పులకరించినా
అనుబంధ పిలుపు చిలకరించినా
వుత్సాహ వార్త వుద్దేశించినా
విషాద వార్త వినిపించినా
రింగు రింగు భామ అదే మొదటి రాగం ఆలాపిస్తుంది!
కిక్కిరిసిన జనారణ్యంలో
నిశ్శబ్ద వాతావరణంలో
రింగు రింగు భామ ఎవరికి వారిని
రింగురింగు లోకంలో కట్టి పడేస్తుంది.!

# కలలు చెక్కిన శిల్పం

పెరుగు రామకృష్ణ

మా దాంపత్యపు
కలలు చెక్కిన సజీవ శిల్పం నువ్వు
మా అనురాగ శిఖరాగ్ర సంగమాల
ప్రణయలీలా విలాస పర్వం నువ్వు

నాఫాలాకాశ కేంద్రీయ సూర్య బింబం
అస్త మిస్తూ వొదిలి వెళ్ళిన జాడల్లోని
తొలి అడుగు చిహ్నం నువ్వు
నా ఏడు జన్మల సశేష దరహాసాల
సుమ సౌందర్య హేల పుంజం నువ్వు

శేష జీవన పార్శ్వ ంలో
నా మండుటెండల ఎడారిలో
బాధ్యతల గొడుగు పట్టే తోడు నువ్వు
నా సమస్యలతో నా కోసం పోరాడే
ఋణశృంఖలాల సైనికుడివి నువ్వు
కన్నీటి మేఘాల వర్షంలో
నేనణు మాత్రమయినా తడవకుండా
వీచిన చిరునవ్వుల ప్రభంజనం నువ్వు

ఆయన నా ప్రాణంలో ప్రాణమైతే
మా ఇరుప్రాణాల పరిచయ వాక్యం నువ్వు

కాలం కుబుసుం విడిచినప్పుడల్లా
రుతువులు పూల పెదవులు స్పృశించినప్పుడల్లా
సముద్రాల పెను ఘోషలో
ఆత్మలు ఆత్మీయుల్ని పేరు పెట్టి పిలిచినప్పుడల్లా
తామరాకుల మీది కోరికల బిందువులు
నా మనసుని మార్మికం చేసినప్పుడల్లా

నీ అమలిన చిరునవ్వుల్లో
ఆయన సాంత్వనని వెతుకుంటాను నేను
నా ఆత్మ విశ్వాసాన్ని పునురుద్ధరించుకుంటాను...

ఆయన నాకోసం
మిగిల్చి వెళ్ళిన జీవితం కొనసాగింపు నువ్వు..
నా ప్రాణాన్ని నిలబెడుతున్న ప్రాణ వాయువు నువ్వే..!

***



# వ్యయం

డా.గంద్రు లక్ష్మణరావు

వ్యయం అంటే భయం దేనికి?
వ్యయం లేనిదే అవ్యయమదెక్కడిది?
పండుటాకులు వ్యయం కానిదే
పచ్చనాకులు వచ్చునా
మావి చివురులు వ్యయం కానిదే
మధురగానం సాగునా?

సాగరమ్ములు వ్యయం కానిదే
జలధరమ్ములు నిండునా
సారమెంతయొ వ్యయం కానిదే
జనని ధరణియు పండునా

చెమటనీరు వ్యయం కానిదే
సిరుల వర్షం కురియునా
జనం ప్రాణం వ్యయం కానిదే
చరిత రూపం దిద్దుకొనునా?
మంచి నీరు వ్యయం కానిదే
మనకు ప్రాణం దక్కునా
బతుకు సొంతం వ్యయం కానిదే
బంధముల్ తెగిపోవునా?



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

అర్థరాత్రి వేళ కడలి యలల సడులు
చిట్టడవిలోన చిరుగాలి చేయు రొదలు
ఊరి చివరన సెలయేటి యూతపాట
ఎవరు విన్నను లేకున్ననేమి లోటు

గాలితో సాగు సుమపరాగంపు హాయి
తరుల మాటున సుమముల పరవశమ్ము
కడలి యడుగున చేపల కలకలమ్ము
ఎవరు చూసిన లేకున్ననేమి లోటు

నా యెదను కదలాడు నానంద జలధి
నా నయనముల దాగు ప్రేమానుభూతి
నా గళమ్మును దాటని త్యాగనిరతి
ఎవ్వరెరుగకపోయిననేమి లోటు

ఎవరు వినలేని కనలేని యెరుగలేని
నా హృదంతరసీమ యేకాంతసీమ
ఆశయునతిశయమ్మును యశమహమ్ము
నన్ను తాకనేరని మహానందసీమ

ఎవరు చూడకనెవ్వరికెరుక లేక
ఇట్టులే బ్రతుకు గడపనిమ్ము నన్ను
సడియటన్నది లేని నిశ్శబ్దమందు
కరిగి ప్రకృతిలో ప్రాణమ్ము కలవనిమ్ము

**Post your comments**